ప్రముఖ

రచయిత(త్రు)ల

కథలు

# హూ

## మన్నెం శారద

సస్పెన్స్ కథ

[illegible]



చికాగో,
అక్టోబర్ 28.

ప్రియమైన అమ్మకి,
నమస్కారం.

నాన్న ఈ నెలలో రిటైరవ్వబోతున్నారని ఈ మధ్య స్టేట్స్ వచ్చిన మన జయకర్ అంకుల్ చెప్పేరు. అంటే ఇప్పుడయినా మీరిక్కడికి వచ్చేస్తారని— నేను, మీ కోడలు శోభ, మనవలు టెంకు, రింకు ఆశపడుతున్నాము. నేను పూర్తిగా ఇక్కడ సెటిలయిపోయేను. ఇండియా తిరిగి రావడం కష్టం. నేను వచ్చినా పిల్లలు ఏ మాత్రం ఇష్టపడరు. నేనెన్ని ఉత్తరాలు రాసినా మీరిద్దరూ ఎన్నడూ ఇక్కడికి రావడం జరగలేదు. ఇక్కడ నా కొలీగ్స్ పేరంట్సు అందరూ వచ్చి వెళ్ళేరు. మీరొక్కసారి కూడా రాలేదని అందరూ అడుగుతున్నారు. ఈ పెద్దవయసులో మీరిద్దరూ అక్కడ వుండి చేసేదేముంది. నాన్నగారి పెన్షన్ సెటిల్ కాగానే రండి. మీ కోసం ఎంతగానో ఎదురు చూస్తూ..... మీ అభిలాష్.

హైదరాబాద్,
నవంబర్ 15.

చిరంజీవి అబ్బాయికి,

మీ అమ్మ దీవించి వ్రాయునది. నీ ఉత్తరం అందింది. చాలా సంతోషించేను.

ఈ వయసులో రోజులోని ఇరవై నాలుగ్గంటలూ నేను ఎదురుచూసేది నీ ఉత్తరం కోసమే! నా ఆత్రం ఆయన కర్థం కాదు. అర్థం చేసుకోరు కూడా. ముప్పయి రెండు సంవత్సరాలు ఖాకీ బట్టల్లో ఇమిడిపోయిన ఆయన గుండె నిజంగానే కరడుగట్టిపోయిందనుకుంటాను. ఎప్పుడూ డ్యూటీ ధ్యాసే. మరో లోకం లేదు. ఈ మధ్య అంటే పోయినేడు మత కలహాల్ని అదుపులో పెట్టడమే కాక రాష్ట్ర ముఖ్యమంత్రిని కాపాడినందుకు ఆయన్ని హోమ్ సెక్రటరీని చేసేరు. ఎన్ని ప్రమోషన్లు, ఎన్ని ఎవార్డులు అందుకొన్నా ఆయనకి తృప్తిలేదు. ఆయనకి మరో సంవత్సరం సర్వీసు పొడిగింపు కూడా ఇవ్వాలనుకున్నారు. నేను నిజంగా హడలి చచ్చేననుకో. మళ్ళీ ఈయన పాతుకుపోతారు కదా ఇక్కడ. నా అదృష్టం కొద్దీ పాత సి.ఎమ్. పదవీ విరమణ చేసేడు. కొత్త సి.ఎమ్. ఈ ప్రపోజల్ని ఒప్పుకోలేదు. దాంతో ఈయన రిటైర్ కాక తప్పలేదు.

రిటైర్‌మెంట్ పార్టీ ఘనంగా జరిగింది. రవీంద్రభారతిలో ఎంత బాగా చేశారని!... ఆ రోజు సిటీలో మరిక పూలే లేవేమోనని నా అనుమానం. అలా ముంచేసేరు మమ్మల్ని. పోలీసు డిపార్టుమెంట్‌లో ఈయనలా అంకిత భావంతో పని చేసే వ్యక్తులుంటే, దేశంలో నేరస్థులేవుండరని అందరూ మెచ్చుకొన్నారు. రాష్ట్రాన్ని అట్టుడికించిన మంగపతిని, మల్లుని కటకటాల వెనక పడేసినందుకు ఆయన్నందరూ అభినందించేరు. రిజర్వేషన్ల వంకతో అన్నెం పున్నెం ఎరుగని విద్యార్థుల్ని ముందుకి తోసి ప్రస్తుత ప్రభుత్వాన్ని పడగొట్టడానికి పూనుకున్న రాజకీయనాయకుడు కాలిని కీళ్ళు తీసి లోపల పడేసే ధైర్యం మీ నాన్నకే వుందని ఎంత ఇదయి పోయేరో!

అంతా బాగానే జరిగింది కానీ... ఏంటో ఆ రోజు రాత్రి మీ నాన్నకి బి.పి. పెరిగి చాలా హడావుడి చేసింది. చాలా కంగారు పడిపోయేను. నిమ్స్‌లో జాయిన్ చేసేం. ఇరవై నాలుగ్గంటలు అబ్జర్వేషన్‌లో పెట్టేరు. దేవుని దయ వలన ఆయన కోలుకున్నారు. నీకు ఫోన్ చేసి చెబుతానంటే ఒప్పుకోలేదాయన.

ఇంతకీ డాక్టరు చెప్పిందేమిటంటే ముప్ఫయి రెండు సంవత్సరాలు ఏకధాటిగా పనిచేసి, ఒక్కసారి డిపార్టుమెంట్ నుండి తప్పుకోవడమంటే ఆయన భరించలేక డిప్రెస్ అయ్యేరట. కొన్నాళ్ళు ఎక్కడికైనా వెళ్ళమని సలహా ఇచ్చారు. ఎటో ఎందుకు నీ దగ్గరకే వెళ్దాం అన్నాను. మళ్ళీ మామూలే. మొహంలో నరాలన్నీ బిగబెట్టేసేరు. నాకు ఒళ్ళు మండింది. "వాడి పేరెత్తితేనే అలా నిప్పులోవేసిన ఉప్పులా చిటపట్లాడి పోతారేం. వాడే కానిపని చేసేడని. ఏదో ప్రేమించి పెళ్ళి చేసుకున్నాడు మీ మాట కాదని. ఎన్నాళ్ళు అలా వాడి మీద బుసకొడ్తారు. వాడి పిల్లలు కూడా పెళ్ళీడు కొచ్చేరుగా" అన్నాను కోపంగా. 'ఊ!ఊ! మాట్లాడింది చాలు' అన్నారు. ఇంకేం మాట్లాడను. పెళ్ళయ్యేక నేను మాట్లాడిందంతా 'హనుమాన్ చాలీసా' అంత వుండదు. అయినా నేను పెదవి కదిపితే, ఆయన— 'మాట్లాడింది చాలు' అంటారు. నీ ఉత్తరం ఆయనకి కనిపించేట్లు పెట్టేను కూడా. ఆయన తప్పక చదివే వుంటారు. కానీ... ఏం మాట్లాడలేదు దాని గురించి.

తొందరలో మిమ్మల్ని కలిసి మనవలతో శేషజీవితాన్ని గడపాలనే ఆశతోనే వున్నాను. నా ఆశ తీరుతుందో లేదో! కోడలికి, మనవలకి నా దీవెనలు — ఇట్లు మీ అమ్మ.

హైదరాబాద్,
నవంబర్ 17.

హలో హోమ్ సెక్రటరీ,


రిటరయ్యేవట. చాలా సంతోషం. రవీంద్రభారతిలో ఘనంగా సన్మానించేరట. మరీ సంతోషం. చాలా మంది కరడుగట్టిన పాషాణాల్ని కటకటాల వెనక పడేసేవని తెగ మెచ్చుకున్నారట నిన్ను. ఇల్లలగ్గానే పండగయిపోదు మిస్టర్ కమిషనర్! సారీ హోమ్ సెక్రటరీని కదూ! నీ అంతం చూడటానికే నేను ఎదురు చూస్తున్నాను. ఈ లోపున కొడుకు దగ్గర కెళ్ళిపోయి దాకోవచ్చనుకుంటున్నావేమో! నీ ప్లాన్ పారదు. నన్ను జైల్లోకి తోయించేవు. నీ మీద పగతీర్చుకోంది నిద్రపోను. నువ్వు పాము పడగ మీద కాలేసేవు. పాపం బ్రతికినన్ని రోజులూ నువ్వు పదవిలో సంపాదించిన ఎవార్డులూ, రివార్డులూ, పొందిన రెమ్యూనరేషన్లు జ్ఞప్తికి తెచ్చుకుని కాలక్షేపం చెయ్యి. అదీ కొన్ని రోజులు మాత్రమే

హైదరాబాద్,
నవంబర్ 20.

డియర్ జాన్,

నీ ఉత్తరం అందింది. నీవు ఆందోళన పడుతూ రాసిన విషయాన్ని చూసి నవ్వుకున్నాను. నువ్వు పోలీసాఫీసరువి. ఇలాంటివెన్నో చూసి వుంటావు. తాటాకు చప్పుళ్ళకి కుందేళ్ళు బెదరుతాయేమో కానీ లాఠీ పట్టుకుని ఖాకీ బట్టలు ధరించిన పోలీసాఫీసర్ను కాదు.

నా భార్య చాలా పిచ్చిది. నాతో ఇన్ని సంవత్సరాలు కలిసి బ్రతికినా ఆమెకు ధైర్యం అలవడలేదు. నిత్యం పూజలు చేసి చేసి ఆమెలో పిరికి తనం ప్రోది చేసుకుంది. నా కొచ్చిన ఆకాశరామన్న ఉత్తరం చూసి ఆమె నిలువెల్లా వణికి పోయింది. వెంటనే ఈ వూరినుండే కాదు ఈ దేశం నుండే పారిపోదాం అంటుంది. నీకు తెలుసుగా మా వాడు అమెరికాలో వున్నాడని. వాడి పెళ్ళి విషయంలో నా మాట కాదన్నాడని నేను చాలా రోజులుగా వాడితో మాట్లాడటం



లేదు. ప్రతిసారీ వాడు నన్ను రమ్మని రాస్తాడు. నేను జవాబివ్వను. మా ఆవిడ వెంటనే పరిగెత్తుకెళ్ళిపోదాం అంటుంది. ఆవిడది తల్లి మనసు. ఒక్కగానొక్క కొడుకుని వదిలేసి వుండలేక ఆరాటపడుతుంటుంది.

కానీ నా సంగతేంటి — ఒక బాధ్యతాయుతమైన ఉద్యోగంలో బిజీగా వుండే నేను, కాలూ చెయ్యి సరిగ్గా వుండగానే వాడింటికెళ్ళి గోళ్ళు కొరుక్కుంటూ కూర్చోవాలా? అందుకే 'నో' అంటాను. కానీ ఆవిడ కొడుకు మీద కోపంతోనే వెళ్ళలేదనుకొని, నిన్ను వచ్చెయ్యమని వ్రాసింది. మొదట్లో వాడి మీద కోపమున్నమాట వాస్తవమే. కాని ఇప్పుడు వాడేం తప్పు పని చేసేడు. ప్రేమించిన అమ్మాయిని మోసగించకుండా పెళ్ళి చేసుకున్నాడు. నిజానికి వాడి హీరోయిజాన్ని అభినందించాలి. నేను కాలేజీలో వుండగా కాత్యాయినిని ప్రేమించి, మానాన్నని చూసి కాళ్ళు వణికి కాంతం మెడలో తాళి కట్టేసేను. అదంతా ఓ కల! గుర్తొస్తే నవ్వొస్తుంది. ఎప్పుడూ సీరియస్‌గా వుండే నేనిప్పుడు ఇలాంటివన్నీ ఖాళీ దొరకడంతో గుర్తు తెచ్చుకుంటున్నాను.

ఆ ఆకాశరామన్న గురించి మరిచిపో. నా సర్వీసులో అలాంటివెన్నో చూశాను నేను. నీ రుద్రమూర్తి.

చికాగో,
నవంబర్ 29.

మహారాజశ్రీ నాన్నగారికి,
నమస్కారం.

మీరు రిటైరయినట్లు అమ్మ రాసింది. మిమ్మల్ని రమ్మని ఎన్నిసార్లు ఉత్తరాలు రాసినా మౌనమే మీ జవాబయింది. ఇంకా నా మీద కోపమేనా? శోభకి మీరంటే ఎంతో గౌరవం. తండ్రిలేని తను మిమ్మల్ని కన్నతండ్రిగా ఆరాధిస్తోంది. మీరిక మాతోనే వుండాలని ఆమె ఆశ.

ఇకపోతే అమ్మ మీ కిటీవల వచ్చిన ఆకాశరామన్న ఉత్తరం గురించి చాలా భయపడుతోంది. పోయిన సంవత్సరం మీరు మతకలహాల సందర్భంలో అరెస్టు చేసి మల్లుని, రిజర్వేషన్స్ సందర్భంలో మీరు మూసేసిన కాళి గాని మిమ్మల్ని బెదరిస్తున్నారని ఆమె అనుమానం. అలాగయితే మీరు వెంటనే నా దగ్గర కొచ్చేయడం మంచిది. ఎందుకంటే వాళ్ళు పచ్చినెత్తురు తాగే


శ్రీమతి మన్నెం శారద.

నరరూప రాక్షసులు. కాబట్టి నామాట వినండి. కొన్నాళ్ళు మీతో కలిసి వుండలానే మా కోరిక తీర్చండి. మీ అభిలాష్.

హైదరాబాద్,
డిసెంబర్ 3.


డియర్ జాన్,

నీ ఉత్తరం అందింది. నిన్ను శ్రీకాకుళం ఎస్.పి.గా పోస్టు చేసేరని, వెళ్ళి జాయినయ్యేనని వ్రాశావు. సంతోషం. నీ ఎదుగుదల, చూసి నేనెప్పుడూ సంతోషపడుతూనే వుంటాను. నేనెప్పుడూ బయటపడలేదు గానీ నువ్వంటే నాకు పుత్రవాత్సల్యం.

ఇక నా ఆకాశరామన్న గురించి ఇంకా ఏం తెలియలేదు. నిజమే మా ఆవిడ నీకు రాసినట్లు మరో బెదరింపు ఉత్తరం కూడా వచ్చింది. నేను కూడా ఇది మల్లు పనే అని భావిస్తున్నాను. కాళి ఇలా ఉత్తరాలు రాయడు. వాడిచ్చిన గడువు మరో మూడు రోజులుంది. ఈ లోగా ఆ సంగతి నేనే తేల్చుకుంటాను. వృత్తి నుండి నేను రిటైరయినా నా బ్రెయిన్ రిటైర్ కాలేదు.

అతని ఉత్తరాలు రెండూ తిరిగి పరిశీలించేను. అందులో కొన్ని పదాలు అతను గమ్మత్తుగా రాశాడు. అది ఒకటి ఎవార్డు, రెండు రివార్డు. మరో తప్పు. అదేమిటంటే రెమ్యూనరేషన్‌కి రెమ్యూమరేషన్ అని. దీంతో నాకు కేసు సులభమైనట్లే. నీకు రాసే మరో ఉత్తరంలో నేను ఆకాశరామన్న పేరు రాసేస్తాను. నీ రుద్రమూర్తి.

హైదరాబాద్,
డిసెంబర్ 27.



చిరంజీవి అభిలాష్‌కి,

నీ ఉత్తరం అందింది. నాకు నీవనుకుంటున్నట్లు నీ మీద కోపమేమీ లేదు. నిజం చెప్పాలంటే మరింత ప్రేమ పెరిగింది. నిన్నూ, కోడలినీ, పిల్లల్నీ ఎంత తొందరగా చూడాలా అని ఆశపడుతున్నాను.

పోతే ఆకాశరామన్న గురించి కంగారేం పడకు. ఇది మల్లుగాడి పనే. నేను వాడి మీద నిఘా వేసేను. వాడు లేనప్పుడు వాడిల్లు సోదా చేశాను. నా కొచ్చిన ఉత్తరాలు వాడింట్లో వున్న నోట్ బుక్ కాగితాలకి సరిపోలి వున్నాయి. మరో గమ్మత్తేమిటంటే వాడు కొందరు విదేశీయులతో కలిసి మన దేశానికి సంబంధించిన గుట్టు బయటపెట్టే ఫైలొకటి దొరికింది. వాణ్ణి పోలీసులకి అప్పజెప్పాను. డ్యూటీ నుండి విరమించినా, నేను దేశానికి చేసిన సేవ చేసేనని ప్రభుత్వం నన్ను మెచ్చుకుని ఎవార్డు ప్రకటించింది. ఆ ఫంక్షన్ అయ్యేక, నేను మీ అమ్మతో నీ దగ్గరకి వచ్చేస్తాను — ఇట్లు ఆశీస్సులతో మీ నాన్న.

చికాగో,

డియర్ జాన్,
జనవరి 19.

నేను స్టేట్స్ రాగానే నీకు వెంటనే ఉత్తరం రాయాలనుకున్నాను. తీరా ఇక్కడికి వచ్చేక మనుమలతో నాకు తీరికే దొరకడం లేదు. నీళ్ళు చాలా ఫాస్టు. నీళ్ళ ప్రశ్నలకి నేను జవాబులే చెప్పలేక పోతున్నాను. 'నువ్వేం పోలీసాఫీసరిని తాతయ్యా? ఎలా చేసేవు ఉద్యోగం!' అని వాళ్ళంటుంటే నాకు సిగ్గేస్తోంది. వాళ్ళచేతిలో ఓడిపోవడం సరదాగా వుంది.

నీకో గమ్మత్తు రాస్తాను. ఈ మధ్య మా వాడి రాక్‌లో నాకో ఉత్తరం దొరికింది. అది మా ఆవిడ మా వాడికి రాసిన ఉత్తరం. నేను మల్లుని పట్టి ప్రభుత్వానికి అప్పజెప్పేక నా గొప్పతనం గురించి వాడికి రాసుకుంది. అందులో నాకు ప్రభుత్వం ఎవార్డో, రివార్డో లేక ఏదో కాష్ రెమ్యూమరేషనో ఇవ్వబోతున్నదని, అది తీసుకున్నాక అమెరికా వస్తామని రాసింది. నేను షాకయి పోయేను. ఇప్పుడర్థమయిందిగా ఆకాశరామన్న ఎవరో! ఏది ఏమైనా మల్లుని పట్టుకోగల్గేను మా ఆవిడ మూలంగా! నా ఎవార్డో, రివార్డో, రెమ్యూమరేషనో ఆవిడకే చెందుతుంది కదూ! — నీ రుద్రమూర్తి.